క్లుప్తంగా

29 నుంచి దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు



మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ వార్షిక వేడుకలను ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు ఆలయ క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలతో వేడుకలు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు తెలియజేశారు. సోమవారం దుర్గాలమ్మ వారికి వేకువజాము నుంచి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామని, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసంతర్పణ ఉంటుందని తెలిపారు. ఆఖరి రోజు మంగళవారం షిర్డీ సాయి బాబాకు ప్రత్యేక పూజలు, ఆరాధనతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

రేపటి నుంచి కుంతీ మాధవుని నవనీతోత్సవం



కుంతీ మాధవ స్వామి

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి నవనీతోత్సవాన్ని ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తుల సహకారంతో ఈ ఉత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఉన్న స్వామి విగ్రహాన్ని 26వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంట నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు వెన్నతో అలంకరిస్తారు. భక్తులు ఇచ్చిన 20 కిలోల వెన్నతో స్వామిని అలంకరిస్తారు. ఆలంకరణ పూర్తయిన తరవాత 27వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. నవనీత అలంకరణలో స్వామి శుక్ర, శనివారాల్లో భక్తులకు దర్శనమిస్తారు.

పేద కుటుంబానికి ఫ్యాబ్ ఆర్థిక సాయం



తల్లీ, కుమార్తెలకు నగదు అందిస్తున్న ఫ్యాబ్ సభ్యులు

భీమునిపట్నం: ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబానికి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) సభ్యులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. పాస్టర్ నరేంద్రకుమార్ మరణించడంలో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న ఫ్యాబ్ సభ్యులు మృతుని భార్య అరుణ, కుమార్తె వలియాకు రూ.10 వేలు సాయం అందించారు. ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ, సభ్యులు గుగ్గిళ్ల సాయి, కట్టమూరి రమణరావు, విజ్జపు సత్యనారాయణ, దేవానంద్ పాల్గొన్నారు.

కుసులవాడలో ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడలో మైనింగ్ అనుమతులపై ఈ నెల 28న మరోసారి నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని జీవీఎంసీ కార్పొరేటర్ గంగారావు డిమాండ్ చేశారు. కుసులవాడలో సీపీఎం బృందాలతో కలసి బుధవారం కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఆగస్టు 28న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించినా, మరోమారు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం ప్రజా వ్యతిరేకమైన చర్య అన్నారు. కుసులవాడ పంచాయతీకి జరిగే నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని మరోమారు వ్యతిరేకించాలని పిలుపు ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, కె.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం.. సహించం

- పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు
- ఆర్ఐల బదిలీకి సిఫార్సు
- జీవీఎంసీ జోన్–2 ఇన్‌చార్జి కమిషనర్, డీసీఆర్ ఫణిరాం

\- మధురవాడ

సాక్షి ఇంటర్వ్యూ



విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీఆర్, జీవీఎంసీ జోన్–2 ఇన్‌చార్జి కమిషనర్ ఎంవీడీ ఫణిరాం స్పష్టం చేశారు. ఇటీవల ఇక్కడ జోనల్ కమిషనర్‌గా పని చేసిన సింహాచలం బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీకి చిక్కి, జైలుకు వెళ్లి, సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇక్కడ వివిధ విభాగాల అధికారులు, సిబ్బందిపై కూడా పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అందరి దృష్టి ఈ జోన్‌పై ఉంది. ఈ నేపథ్యంలో కొత్తగా జెడ్సీగా బాధ్యతలు స్వీకరించిన ఫణిరాం అక్కడి పరిస్థితులను చక్కదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. కౌన్సిల్‌లో చర్చ సందర్భంగా రెవెన్యూ విభాగంపై ఫిర్యాదులు వచ్చాయి. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో దీనిపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. పని తీరు బాగాలేని వారికి మెమోలు ఇస్తున్నాం. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలోపు పరిష్కరించకుండా, కావాలనే కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలు వస్తే చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్ఐలను ట్రాన్స్‌ఫర్ చేయాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశాం.

టౌన్‌ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టి

టౌన్‌ప్లానింగ్ విభాగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. జోన్ పరిధిలో పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా, అనధికార నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఫిర్యాదులున్నాయి. దీనిపై ఇటీవల సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పని తీరు మార్చుకోని అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ, అలాగే అటువంటి నిర్మాణాల విషయంలో చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందికి మెమోలు ఇస్తున్నాం.

ఏ సమస్య ఉన్నా నేరుగా ఫోన్ చేయవచ్చు

అధికారులు, సిబ్బందిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదు. ఇబ్బందులు ఉంటే నేరుగా నాకే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయండి. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి ఏ సమస్యలు ఉన్నా ఆయా విభాగాల అధికారులు సక్రమంగా స్పందించకపోయినా నేరుగా నాకు 99128 72224 నంబరులో ఫిర్యాదు చేయవచ్చు.

సచివాలయ వ్యవస్థపై పర్యవేక్షణ

సచివాలయ వ్యవస్థ పనితీరు మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నాం. అక్కడి సిబ్బంది పని విధానాన్ని పర్యవేక్షించేందుకు ప్రతీ వార్డులో ప్రత్యేకాధికారులను నియమించారు. వారి పనితీరును కూడా ఇంకా మెరుగుపరచాల్సి ఉంది. అందుకు చర్యలు తీసుకుంటున్నాం.

సచివాలయాల్లో నిరంతరం ఫిర్యాదుల స్వీకరణ

ప్రజా సమస్యలపై సచివాలయాల్లో నిరంతరం ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఏ రోజు, ఏ సమయం అనేదానితో సంబంధం లేదు. కార్యాలయ పనివేళల్లో ఎప్పుడైనా, ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. సచివాలయ సిబ్బంది ఫిర్యాదు తీసుకుని రసీదు ఇస్తారు. జోనల్ ఆఫీసులో ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రభుత్వం సోమవారం ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'పీజీఆర్ఎస్' ప్రవేశపెట్టింది. మిగిలిన సందర్భాల్లో ఫిర్యాదులు తీసుకోకూడదని లేదు.

900 వీధి లైట్ల మంజూరు

వీధిలైట్లు చాలా చోట్ల సక్రమంగా వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తక్షణ చర్యలు చేపడుతున్నాం. జోన్‌లో సుమారు 1240 వీధిలైట్లు కొత్తవి అవసరం ఉన్నట్టు గుర్తించారు. 9 వార్డులకు సంబంధించి, వార్డుకు 100 చొప్పున 900లైట్లు కొత్తవి మంజూరు అయ్యాయి. త్వరలోనే వాటిని అమర్చుతారు.

స్మృతుల పరిమళం

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి అధ్యాపకుడిని సత్కరిస్తున్న పాలకొండ ఎల్‌వీజీజే పూర్వ విద్యార్థులు

శిల్పారామంలో పూర్వ విద్యార్థుల స్మృతుల పరిమళం గుభాళించింది. 42 సంవత్సరాల స్నేహబంధాన్ని మరింత పదిల పరచుకుంటూ ఏర్పాటు చేసిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఎల్‌వీజీజే కళాశాలలో 1981-82 విద్యాసంవత్సరంలో ఇంటర్ చదివిన విద్యార్థులంతా సకుటుంబ సపరివార సమేతంగా హాజరై అలనాటి జ్ఞాపకాలతో ఉత్సాహంగా గడిపారు. నాటి అధ్యాపకులు మధుసూదనరావు, జనార్ధనరావు, ప్రభాకరరావు, కూర్మేశ్వరరావు, ప్రభాకర శర్మలను.. పూర్వ విద్యార్థిని, ఉమ్మడి విశాఖ జిల్లాల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.రూపవతి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహచర విద్యార్థులకు 'ఏజ్‌గ్రూప్ మిత్రమండలి' ద్వారా ప్రతి నెలా ఆర్థిక సహకారం అందిస్తున్నామని చెప్పారు. పలు సేవాకార్యక్రమాలనూ నిర్వహిస్తున్నామన్నారు. రోజంతా ఉత్సాహంగా గడిపిన వారంతా ఎప్పటికీ ఈ ఒరవడిని కొనసాగిద్దామంటూ వీడ్కోలు తీసుకున్నారు.

\- పీఎం పాలెం

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం



అనుగ్రహ భాషణం చేస్తున్న పీఠాధిపతి ఉమర్ అలీషా, పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం: ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా ప్రశాంతమైన జీవనాన్ని గడపగలరని బీచ్ రోడ్డులోని విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా అన్నారు. పీఠం 23వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో వ్యవహరించాలని, ఇతరులకు మేలు చేసే స్వభావం కలిగి ఉండాలని అన్నారు. దానివల్ల మనకే కాకుండా సమాజానికి కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. మనం వెళ్లే మార్గంలో ఆటంకాలు వచ్చినా, వాటిని తట్టుకుని పట్టుదలతో ముందుకు సాగాలని, అప్పుడే అనుకున్న గమ్యానికి చేరుకోగలమని పేర్కొన్నారు. గురువులు, పెద్దలు చెప్పే మాటలను పాటించినట్లయితే మంచి జరుగుతుందన్నారు. వారు మనలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన మార్గంలో నడిపిస్తారని తెలిపారు. మన జన్మకు కారణమైన తల్లిదండ్రులను విస్మరించకూడదని, వారిని ఎంతో గౌరవంగా చూసుకోవాలని ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర యోగి, మనోజ్‌కుమార్ జైన్, పరవస్తు ఫణిశయన సూరి, పీఠం కన్వీనర్ పింగళి ఆనందకుమార్, ముఖ్య సభ్యులు డి.వి.నారాయణరావు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కరుణ, ప్రేమ, క్షమ.. క్రీస్తు సందేశం

- బిషప్ డాక్టర్ కేఆర్ సింగ్
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఏసుక్రీస్తు జననాన్ని తెలిపే నాటకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



క్రిస్మస్ ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు



క్రిస్మస్ సందేశం ఇస్తున్న నెతన్య చర్చిల వ్యవస్థాపకుడు బిషప్ డాక్టర్ కేఆర్ సింగ్

మధురవాడ: ప్రేమ, కరుణ, క్షమా గుణాలను తన జీవిత సందేశంగా ఏసు క్రీస్తు మానవాళికి అందించారని నెతన్య చర్చిల వ్యవస్థాపకుడు, దైవ సేవకుడు బిషప్ డాక్టర్ కేఆర్ సింగ్ అన్నారు. ఆయన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా మధురవాడ సమీపంలోని పరదేశిపాలెం, బోయిపాలెం తదితర ప్రాంతాల్లోని నెతన్యా చర్చిలు, ఇతర ప్రార్థనా మందిరాలలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన దైవ సందేశం ఇచ్చారు. ప్రజల కోసం సిలువ ఎక్కిన క్రీస్తు అవలంబించిన శాంతి, సహనం, ఔదార్యం సర్వదా అనుసరణీయమన్నారు. ఈ సందర్భంగా ప్రజల శాంతి సౌభాగ్యాలతో ఆరోగ్యంగా ఉండాలని సర్వజన సంక్షేమం కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తును స్తుతిస్తూ పాడిన గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘ కాపరులు రెవరెండ్ వై.ఆమోసు, రెవరెండ్ జి.జాన్‌బాబు పలు ప్రాంతాలకు చెందిన విశ్వాసులు పాల్గొన్నారు.



తగరపువలస ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఒకటోవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు



చిట్టివలస లండన్ మిషన్ చర్చి క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న సభ్యులు

- జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లోని మారికవలస ఆర్‌జీకే కాలనీ, మధురవాడ, వాంబే కాలనీ, మిథిలాపురి ఉడా కాలనీ, బక్కన్నపాలెం, స్వతంత్రనగర్, కొమ్మాది జంక్షన్ తదితర ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో..

తగరపువలస: ఒకటో వార్డు ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, చర్చి ప్రెసిడెంట్ గండి జాన్ ప్రకాష్, పాస్టర్ విలియం సునీత్‌బాబు, కార్యదర్శి జోసెఫ్ జేమ్స్‌తో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు వెంకటరెడ్డి, ఉప్పాడ నాగేశ్వరరావు, పందిరి విజయ్, లెంక రమేష్, సారిక చేతన్‌కుమార్, గండి మోజెస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

- బంగ్లామెట్ట సీయోను ప్రార్థనా మందిరం, కొండపేట జీవం గల దేవుని సంఘం, చిట్టివలస లండన్ మిషన్ చర్చిలలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదర్శనగర్, దాకమర్రి, చిల్లపేట, తాటితూరు, టి.నగరపాలెం, అన్నవరం, చిప్పాడ, మజ్జివలస, సంగివలస, వలందపేట, వేములవలస, గంభీరం, ఆనందపురం, వెల్లంకి, పెద్దిపాలెం, గండిగుండం, కుసులవాడ గ్రామాల్లో క్రిస్మస్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

అలరించిన క్రీస్తు జనన నాటక ప్రదర్శన

కొమ్మాది: సియోను రాజు మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ జార్జ్ ముల్లర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రార్థనలు నిర్వహించిన అనంతరం క్రిస్మస్ పాటలు పాడారు. చిన్నారులు ప్రదర్శించిన క్రీస్తు జనన నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎండాడ, రుషికొండ, సాగర్‌నగర్ ప్రాంతాల వారు పాల్గొన్నారు.

- చేపలుప్పాడ, నగరపాలెం, మంగమారిపేట, మారికవలస ప్రాంతాల చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

సెయింట్ పీటర్స్ చర్చిలో..

భీమునిపట్నం: కీతిన్‌పేట వద్దగల సెయింట్ పీటర్స్ చర్చిలో పాస్టర్ చైతన్యకుమార్ బైబిల్‌లోని దైవ సందేశాన్ని అందించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. చర్చి సంఘ కార్యదర్శి కులిడి సురేష్ కుమార్ పిల్లలకు క్రిస్మస్ కానుకలను అందించారు. కార్యక్రమంలో సభ్యులు విజయ్, సురేష్, సుధాకర్, శేఖర్‌నాయుడు పాల్గొన్నారు.



బంగ్లామెట్ట సీయోను ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు



సెయింట్ పీటర్స్ చర్చిలో దైవ సందేశాన్ని అందిస్తున్న పాస్టర్ చైతన్యకుమార్, పాల్గొన్న క్రైస్తవులు

సీపీఎం మహాసభలు జయప్రదం చేయండి



ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: ఈ నెల 28, 29 తేదీలలో పెందుర్తి వద్ద సుజాతనగర్‌లో జరగనున్న సీపీఎం విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు బుధవారం ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు ప్రారంభించారు. ద్విచక్రవాహనాల ర్యాలీ ప్రధాన వీధులలో జరిగింది. కార్యక్రమంలో నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము, పల్లా పెంటరాజు, నమ్మి నాయుడు, గుజ్జు పైడి వెంకట సూరిబాబు, శ్రీనివాసరావు, జీరు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

హైవే వెంట పశువుల వ్యర్థాలు



వెంకటేశ్వరమెట్ట వద్ద జాతీయరహదారి పక్కన పశువుల వ్యర్థాలు

తగరపువలస: స్థానికంగా పశు మాంసాలను విక్రయించే వ్యాపారులు తమ తీరును మార్చుకోవడం లేదు. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి వెంబడి వెంకటేశ్వరమెట్ట వద్ద ఫుట్‌పాత్‌ను ఆనుకుని పశువుల వ్యర్థాలను పారవేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు దుర్గంధం భరించలేక ముక్కు మూసుకుంటున్నారు. వ్యర్థాలను నమ్మివానిపేట డంపింగ్ యార్డుకు తరలించవలసి ఉన్నా వ్యాపారులు పెడచెవిన పెట్టి కాలుష్యానికి కారణమవుతున్నారు. గతంలో చాలాసార్లు వ్యాపారులు వ్యర్థాలను పారవేయడం, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు హెచ్చరించడం జరిగింది. కానీ ఇది మామూలు అయిపోయింది. ఇకపై అయినా పటిష్టంగా చర్యలు తీసుకుని వ్యర్థాలను రహదారుల పక్కన డంప్ చేయకుండా అరికట్టాలని తగరపువలస, చిట్టివలస వాసులు కోరుతున్నారు.

వర్షం.. ముంచేసింది..

- నీటిలోనే వరికుప్పలు
- ఇటుకబట్టీలకూ తీవ్ర నష్టం



టి.నగరపాలెంలో నీటిలోనే వరి గాలికుప్పలు



వర్షాలకు తడిచిపోయిన ఇటుక బట్టీలలోని ఊక, బొగ్గు



తాటితూరులో నీట మునిగిన వరిపైరు

తగరపువలస: తుపాను ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భీమిలి మండలంలో రైతులు, ఇటుక బట్టీల యజమానులు నష్టాలను చవి చూస్తున్నారు. నెలరోజుల వ్యవధిలో వచ్చిన రెండో తుపాను చలిగాలులతో వణికిస్తుండటంతో కూలీలు అందుబాటులో లేకుండా పోయారు. మధ్యలో పగటివేళ కాస్త తెరిపి ఇచ్చినప్పుడు రైతు కుటుంబాలు వరిపంటను కోసి పొలంలోనే గాలికుప్పలు పెట్టారు. ఇక్కడి నుంచి వర్షంనీరు బయటకు వెళ్లకపోడంతో కుప్పల అడుగు భాగంలో చేరిన నీరు వలన పాక్షికంగా వరిపనలు దెబ్బతింటాయని రైతులు అంటున్నారు. ఇంకా కోతలు జరగని గ్రామాలలో వరిపైరు గాలికి నేలవాలి వర్షం దెబ్బకు తడిచిపోయింది. గురువారం కూడా వర్షసూచన ఉండటంతో ఈ పంట మరి పనికిరాదని మజ్జివలస, తాటితూరు, టి.నగరపాలెం, దాకమర్రి, కుసులవాడ, ఆనందపురం రైతులు అంటున్నారు.

నిలిచిన ఇటుకల తయారీ

భీమిలి నియోజకవర్గంలోని పలు ఇటుకబట్టీలకు తుపాను ప్రభావంతో నష్టం వాటిల్లింది. వరుస వర్షాల కారణంగా ఇటుక అమ్మకాలతో పాటు తయారీ నిలిచిపోయింది. దీంతో పాటు బట్టీల వద్ద బొగ్గు, మట్టి కరిగిపోవడం, ఊక కొట్టుకుపోవడం వంటి నష్టాలు చవిచూస్తున్నారు.